సాక్షి
చిత్తూరు

మంగళవారం । 27 । జూన్ । 2023



యువ న్యాయవాదులకు 'నేస్తం'

జూనియర్ అడ్వొకేట్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకం కింద సాయం చేస్తోంది. - 8లో



'చీటి'ంగ్..!

జిల్లాలో అక్రమ సంపాదనే లక్ష్యంగా కొందరు అనధికారికంగా చీటీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	37	27
తిరుమల	32	22
గూడూరు	38	29
నగరి	38	27

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జూలై 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల పీడీలు తులసి, గంగాభవానీ, రాధమ్మ, నాగ శైలజ, పద్మనాభం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్, డీపీఓ లక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం జితేందర్ రెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ పరిశీలన

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్‌ను ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించారు.

హెచ్ఎంలుగా 12 మంది ఎస్ఏలకు బాధ్యతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 12 మంది సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ విజయేంద్రరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని సీనియర్ హెచ్ఎంలను ఇటీవల ఎంఈఓ-2లుగా నియమించిన నేపథ్యంలో ఆయా స్థానాలను ఎస్ఏలతో భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

29న బక్రీద్

చిత్తూరు రూరల్: బక్రీద్ పండుగను ఈ నెల 29వ తేదీన జరుపుకోవాలని జిల్లా ఖాజీ జనాబ్ మౌల్వీ సయ్యద్ షా మహమ్మద్ కమాలుల్లా జుహూరీ లతీఫీ చిష్టియుల్ ఖాదరీ జునైదీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పవిత్ర పర్వదినాన ముస్లింలు అల్లా ఆనతి మేరకు ఖుర్బానీ ఇవ్వాల్సిందిగా సూచించారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపీనాథరెడ్డి



చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గోపీనాథరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం చిత్తూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. అలాగే అసోసియేట్ అధ్యక్షుడిగా కె.గిరిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కేబీ లక్ష్మీపతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.బాలసుందర్, కోశాధికారిగా వి.రాజేష్, ఉపాధ్యక్షుడిగా ఎ.ప్రభాకర్‌రెడ్డి, జి.దామోదరం, పీఎస్ గణేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా డీజీ దామోదరం, కేఆర్ హరికృష్ణ, వి.పవనకుమారి ఎన్నికయ్యారు.

స్పందన అర్జీలకు సత్వరం పరిష్కారం



సమస్య తెలుసుకుంటున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జేసీతో పాటు డీఆర్ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ స్పందనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. మొత్తం 185 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పోలీసు స్పందనకు 17 వినతులు

చిత్తూరు అర్బన్: నగరంలో సోమవారం నిర్వహించిన పోలీసు శాఖ స్పందనకు 17 వినతులు అందాయి. ఏఎస్పీ సుధాకర్ ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. ఆ మేరకు ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

'కుప్పం ప్రజలు చంద్రబాబును 35 ఏళ్లుగా గెలిపిస్తున్నారు. మీ అండదండలతోనే ఆయన 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కానీ తన సొంత నియోజకవర్గానికి కనీసం నీళ్లు కూడా ఇవ్వలేకపోయారు. ఇప్పుడు అవకాశం కావాలని అడుగుతున్నారు. ఇప్పటికైనా కుప్పం ప్రజలు ఆలోచించండి. చంద్రబాబు మోసాన్ని గుర్తించండి. కుప్పంలో వైఎస్సార్‌సీపీకి ఒక్కసారి మద్దతు ఇవ్వండి. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపుతాం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలంలో విస్తృతంగా పర్యటించారు. వివిధ పంచాయతీల్లో జరిగిన సభల్లో చంద్రబాబు మోసాలను ఎండగట్టారు.

ఆలోచించండి.. మద్దతు ఇవ్వండి!



పంద్యాలమడుగు సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- దూరదృష్టితోనే పథకాల రూపకల్పన
- నాలుగేళ్లలో 99 శాతం హామీలు నెరవేర్చాం
- కరోనా కాలంలోనూ నిరాటంకంగా సంక్షేమ పథకాలు
- చంద్రబాబు కుప్పానికి చేసిందేమీ లేదు
- రామకుప్పం పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి

కుప్పం/రామకుప్పం: భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా రామకుప్పంలోని పంద్యాలమడుగు, గౌరివిమాకులపల్లి, బందార్లపల్లి, ముద్దనపల్లి, మణీంద్రం, సింగసముద్రం, రాజుపేట, చెల్దిగానిపల్లి, కొంగాటం గ్రామాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడారు. విద్యార్థులు, యువతను దృష్టిలో ఉంచుకుని నాడు–నేడు, వైద్యశాలల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మొదట సచివాలయ వ్యవస్థ తీసుకువస్తే విపక్షాలు లేని పోని రద్ధాంతం చేశాయని, కరోనా కాలంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ లేకపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యేవని గుర్తుచేశారు. ఇదే తరహాలోనే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇంగ్లిషు సరళంగా నేర్చుకుని ఉద్యోగాల కోసం బయటి దేశాలకు వెళ్తే వారి కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలల ఆధునీకరించి, వాటికి సరిపడా సిబ్బందిని నియమించడం ద్వారా పేదలచెంతకే వైద్యం వచ్చినట్లయిందని చెప్పారు. ఇందులో భాగంగానే వైద్యరంగంలో 40 వేల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాల, సూపర్ స్పెషలాలిటీ ఆస్పత్రులు తీసుకువస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2,300 జబ్బులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల్లోని ఆస్పత్రుల్లో కూడా ఉచితంగా చికిత్సలు చేసుకోవచ్చన్నారు.



బందార్లపల్లి సభకు హాజరైన మహిళలు

హామీలు పూర్తిచేసిన తర్వాతే ఎన్నికలకు

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచినట్టు తెలిపారు. హామీలే కాకుండా మరెన్నో పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఎక్కడ మేనిఫెస్టో మరిచిపోతారో అని తన కార్యాలయంలో ఫొటో తీసి పెట్టుకున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. మంత్రులు కూడా వారివారి కార్యాలయాల్లో మేనిఫెస్టో పెట్టుకునే విధంగా చేశారంటే ఆయన నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. ఇప్పటి వరకు ఇలాంటి నిర్ణయాన్ని ఏ ప్రభుత్వం తీసుకోలేదన్నారు.



వలంటీర్‌కు పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోని అనుసరిస్తున్న బాబు

ప్రజల్లో తగ్గుతున్న అభిమాన్ని చంద్రబాబు ఓర్వలేక, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోని అనుకరించే పరిస్థితికి వచ్చాడని మంత్రి పెద్దిరెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం అని చెప్పి.. దాన్ని అమలు చేయకపోగా.. ఇప్పుడు మరలా అదే హామీని ప్రజల ముందుకు తెచ్చి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇదిచాలక తమిళనాడు, కర్ణాటక మేనిఫెస్టోలోని అంశాలను కూడా తీసుకొస్తున్నారని.. ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనం నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, నాయకులు కొండవీటి నాగభూషణం, వెంకటరెడ్డియాదవ్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మొగసాల రెడ్డెప్ప, రామకుప్పం ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, కురబ సంఘ నాయకుడు ఆర్లేళ్ల జయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ఉజ్వల భవిత

పాఠశాల చదువు ముగించుకుని కళాశాలలో ప్రవేశించడమంటే విద్యార్థులకు సరికొత్తగా ఉంటుంది. కొత్త బంగారులోకంలోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుంది. తెలియని ఉత్సాహం ఉప్పొంగుతుంది. నూతనోత్తేజం పరవళ్లుతొక్కుతుంది. అయితే పిల్లల జీవితాలను మలుపు తిప్పేది కాలేజీ దశే. ఆకర్షణలు.. ప్రలోభాలకు లోను కాకుండా ముందుకు సాగితే ఉన్నతశిఖరాలను అధిరోహించే అవకాశముంటుంది. ఏమాత్రం అలసత్వం వహించినా భవిష్యత్ అంధకారంగా మారుతుంది.

- ప్రారంభమైన జూనియర్ కళాశాలలు
- విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్న విద్యావేత్తలు
- చదువుపైనే దృష్టి సారించాలి
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- గాడి తప్పితే భవిష్యత్ అంధకారమే

పుత్తూరు రూరల్: జిల్లావ్యాప్తంగా జూనియర్ కళాశాలు ప్రారంభమయ్యాయి. కాలేజీ మెట్టు ఎక్కినప్పటి నుంచి విద్యార్థినీవిద్యార్థుల కోసం రకరకాల ఆకర్షణలు ఎదురు చూస్తూ ఉంటాయి. ఉన్నతంగా చదువుకోవాలన్నా.. పెడదోవ పట్టాలన్నా పలు మార్గాలు కనిపిస్తూ ఉంటాయి. అయితే భవిష్యత్‌కు కీలకమైన ఈ దశలో పిల్లలకు చదువే తొలి ప్రాధాన్యం కావాలి. కాలేజీ ఎగ్గొట్టి సినిమాలకు వెళ్లడం, హీరోయిజం పేరిట రౌడీయిజం చేయడం తప్పని తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. కేవలం పాఠ్యంశాలపైనే దృష్టి సారించాలి. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రాబోయే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎప్పటికప్పుడు సన్నద్ధం అవుతుండాలి.



సరైన స్నేహితులను ఎంచుకోవాలి


ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. ఉన్నత భావాలు కలిగిన వారితో స్నేహం కుదిరితే జీవితం సుఖమయమే అవుతుంది. లేదంటే భవిష్యత్ ప్రమాదంలో పడిపోతుంది. సరిదిద్దుకోలేని విధంగా పశ్చాత్తాపాన్ని మిగులుస్తుంది. చదువుపై ఇష్టం, తోటివారి పట్ల గౌరవం, సమాజంపై అవగాహన, అధ్యాపకులపై నమ్మకం ఉన్నవారితో స్నేహం చేస్తే మంచిదని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు. అలాంటి వారి దృక్పథంతోనే ముందుకు సాగాలని కోరుతున్నారు. లేదంటే చెడు వ్యసనాలు, అలవాట్లతో పతనం కావాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో పది పరీక్షలు రాసిన విద్యార్థులు
21,390
ఉత్తీర్ణులైనవారు
20,579

చెడు అలవాట్లు ప్రమాదకరం

కాలేజీలో చేరగానే తాము పెద్దవాళ్లయిపోనట్లు పిల్లలకు ఫీలింగ్ వస్తుంది. ఈ దశలోనే పలు చెడు అలవాట్లకు బీజం పడుతుంది. ఈ విషయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. సిగరెట్లు, గుట్కాలు, మద్యానికి దూరంగా ఉండాలి. అలాగే సెల్‌ఫోన్లలో చాటింగ్ తదితరాల జోలికి వెళ్లకూడదు. ఈవ్ టీజింగ్‌లు, ప్రేమ పేరుతో వేధింపులు, అశ్లీల చిత్రాలను వీక్షించడం ప్రమాదరకరమని గుర్తించాలి.


భవిష్యత్‌కు పునాది



"విద్యార్థుల భవిష్యత్‌కు ఇంటర్ చదువు పునాది వంటిది. ఇక్కడే జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. అందుకు అనుగుణంగా బాగా చదువుకుంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత తమపై ఉందనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలి.

– పి.అమ్ముదేవి, అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పుత్తూరు

తల్లిదండ్రుల సలహాలు అవసరం



ఇంటర్ అంటే 16 ఏళ్లు. ఆ వయస్సులో రకరకాల ఆలోచనలు సహజంగా కలుగుతుంటాయి. తమ కెరీర్‌కు సంబంధించిన నిర్ణయాలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వారి స్నేహితులు, బంధువుల ప్రభావం కూడా వారిపై పడే అవకాశం లేకపోలేదు. ఏది ఏమైనా తల్లిదండ్రుల సలహాలు ఆ సమయంలో పిల్లలకు ఎంతో అవసరం.

– కవిత, పిల్లల మానసిక వైద్యనిపుణులు, తిరుపతి

జగనన్న సుపరిపాలనతోనే జనంలోకి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు రూరల్/ చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతోనే జనంలోకి వెళుతున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఏమన్నారంటే..

- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతాన్ని ముఖ్యమంత్రి జగనన్న నెరవేర్చారు.
- రైతుభరోసా, డ్వాక్రా రుణమాఫీ, పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు.
- చిత్తూరు నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.1098.50కోట్లు ఖర్చుపెట్టాం.
- చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల మండలాల్లో 513 రోడ్ల నిర్మాణానికి రూ.318.64 కోట్లు వెచ్చించాం.
- రూ. 20.16కోట్లతో 73 సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాలను నిర్మించాం.
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో చిత్తూరు –పూతలపట్టు రోడ్డును రూ. 80 కోట్ల వ్యయంతో పూర్తి చేశాం.
- అమృత్ పథకంలో భాగంగా చిత్తూరుకు తాగునీటిని అందించేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నాం.
- కేంద్రీయ విద్యాలయానికి సంతపే పీఎస్‌సీ పాఠశాల వద్ద 10 ఎకరాల భూమిని చూస్తున్నాం.
- చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ పక్కన స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని శరవేగంగా నిర్మిస్తున్నాం.
- నగరంలో పలు కూడళ్లు, రోడ్లను అభివృద్ధి చేశాం.
- సీఎంసీ ఆస్పత్రి ఆరోగ్య శ్రీ వర్తించేలా, ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ద్వారా చికిత్స అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం.
- భూ ఆక్రమణ, అవినీతి పేరుతో అసత్య ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదు.
- గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ సానుభూతిపరులకే పథకాలు అందించారు.
- జన్మభూమి కమిటీల పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టారు. మీట్ ది ప్రెస్ అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఘనంగా సత్కరించింది.

30 నుంచి కిష్కింధకాండ పారాయణం

తిరుమల: సృష్టిలోని సకల జీవరాశులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30 నుంచి జూలై 15వ తేదీ వరకు తిరుమలలో షోడశదిన కిష్కింధకాండ పారాయణ దీక్షను నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం వెల్లడించింది.

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరులో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. గాంధీ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ కూడలి వరకు సాగిన ర్యాలీ అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించేవారిలో అధికంగా యువత ఉండడం ఆందోళనకరమన్నారు. మత్తు పదార్థాల వ్యాపారం చేసేవారిని వదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. నిందితులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్ ముట్టుకోమంటూ విద్యార్థులలో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌కుమార్, మురళీధర్, సీఐలు విశ్వనాథరెడ్డి, మద్దయ్య ఆచారి, రవిశంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో న్యాయమూర్తి కరుణకుమార్

పూతలపట్టు : యువత మాదకద్రవ్యాల బారిన పడకూడదని సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్ కోరారు. మండలంలోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడితే జ్ఞాపకశక్తి నశించిపోతుందని, శారీరక రుగ్మతలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఏఎస్పీ లక్ష్మి మాట్లాడుతూ మాదకద్రవ్యాలను ఎవరైనా వినియోగిస్తే 14500 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఎస్ అయేషాబేగం, సీఐ జోగేంద్ర, హెచ్ఓడీ విజయ్‌కుమార్, సుజాత పాల్గొన్నారు.

టెంపో ఢీకొని వ్యక్తి మృతి


నీలకంఠ మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని బలిజపల్లె వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. పలమనేరు మండలం మంచినీళ్ల కుంటకు చెందిన నీలకంఠ (41) ద్విచక్రవాహనంపై గంగాధరనెల్లూరు మండలం మహదేవమంగళంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగుప్రయాణంలో బలిజపల్లె వద్ద పెట్రోల్ అయిపోవడంతో బైక్ నిలిచిపోయింది. పెట్రోల్ తెచ్చుకునేందుకు నీలకంఠ రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి బెంగళూరు వెళుతున్న టెంపో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు వాహనాల వేలం

పలమనేరు : వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పలమనేరు ఎక్సైజ్ స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

- పలమనేరు మండలం మొరం పంచాయతీ కన్నమాకుపల్లెలో ఇటీవల చీటిల పేరిట రూ.లక్షల్లో మోసం చేశారు. అలాగే గంటావూరులో ఓ మహిళ చుట్టుపక్కల వారికి టోపీ పెట్టి రూ.50లక్షలతో ఉడాయించింది. తాజాగా గంగవరం మండలం నలసానపల్లెలో శంకరయ్య, జ్యోతి దంపతులు దాదాపు రూ.10కోట్లకు చీటింగ్ చేశారు.

చీటింగ్..!



బిడ్డ పెళ్లికి నగదు సమకూర్చుకోవాలి.. పిల్లల చదువుకు కొంచెం కొంచెం కూడబెట్టుకోవాలి.. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు కావాల్సినంత సొమ్మును పోగేసుకోవాలి.. ఇలాంటి కారణాలతో పలువురు చీటీలను వేసుకుంటున్నారు. అవసరాలకు కావాల్సిన మొత్తం అందుతుందని ఆశపడుతున్నారు. ఇదే అదనుగా కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. జనం నెత్తిన యథేచ్ఛగా టోపీ పెట్టేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా.. కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా.. అనధికారికంగా చీటీలు నిర్వహిస్తున్నారు. కాస్త తేడా వచ్చిందంటే పెట్టేబేడా సర్దుకుని చెక్కేస్తున్నారు. చివరకు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

- చిట్స్ పేరుతో పెరుగుతున్న మోసాలు
- అధిక వడ్డీకి ఆశపడితే తప్పదు శఠగోపం
- యథేచ్ఛగా సొమ్ము ఎగ్గొట్టేస్తున్న ఏజెంట్లు
- రిజిస్ట్రేషన్ లేకుంటే చీటీలు వేయొద్దంటున్న పోలీసులు

పలమనేరు : జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా సుమారు రూ.100 కోట్ల వరకు అనధికార చిట్స్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు చీటీలు జరుపుతున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ఎక్కువగా ప్రభుత్వోద్యోగులు, రాజకీయ నాయకులు, కొంచెం ఆడంబరంగా కనిపించే వ్యక్తులే ఉన్నారు. వీరిలో కొందరు కొన్నాళ్లపాటు నమ్మకంగా చీటీలు నిర్వహిస్తున్నారు. తర్వాత నెమ్మది నెమ్మదిగా సొమ్మును కూడబెట్టుకుని ఉడాయించేస్తున్నారు.

కమీషన్ కోసం..

చిట్స్ ఏజెంట్‌కు ఓ చీటీ ఉచితంగా ఉంటుంది. దీంతో చీటి స్థాయిని బట్టి రూ. 50 వేల నుంచి రూ.50 లక్షల దాకా వస్తుంది. అయితే చీటీ పాడుకున్న వారిలో ఎవరైనా డబ్బు చెల్లించకుంటే ఆ భారం వీరే మోయాల్సి ఉంటుంది. కానీ, చాలా మంది ఏజెంట్లు సదరు భారాన్ని చీటిలోని సభ్యులపై వేసేసి చేతులెత్తేస్తున్నారు. తాజాగా నలసానిపల్లెలో వెలుగు చూసిన ఘటనే ఇందుకు నిదర్శనం. శంకరయ్య, జ్యోతి దంపతులు గ్రామంలో మంచి ఇల్లు కట్టుకుని బాగా డబ్బున్న వారిలా బిల్డప్ ఇచ్చారు. పలమనేరులో చాలా స్థలాలున్నాయని స్థానికులను నమ్మించారు. చీటీలను పగడ్బందీగా నిర్వహిస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. దీంతో చాలామంది వీరి వద్ద చీటీలు వేశారు. డబ్బులు బాగా జమైన తర్వాత ఆ దంపతులు ఇంటికి తాళం వేసి ఉన్న ఆస్తులను బంధువులు రిజిస్ట్రేషన్ చేసి దర్జాగా పరారయ్యారు. చివరకు చీటీలు వేసినవారు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శంకరయ్య ఇంటి వద్ద బాధితులు (ఫైల్)


నలసానపల్లెలో శంకరయ్య ఇల్లు

అత్యాశతోనే అగచాట్లు



ఎక్కువ వడ్డీ గిట్టుబాటు అవుతుందనే అత్యాశతోనే ఈ అగచాట్లు వస్తున్నారు. అనధికారిక చీటీల్లో చేరడం మంచిది కాదు. ఎంత చెప్పినా ఈ విషయాన్ని జనం అర్థం చేసుకోవడం లేదు. నలసానిపల్లెలో మోసం చేసి పారిపోయిన దంపతులపై కేసు నమోదు చేశారు. పకడ్బందీగా దర్యాప్తు చేస్తున్నాం.
– సుధాకర్ రెడ్డి, డీఎస్పీ, పలమనేరు

రిజిస్ట్రేషన్ లేకుంటే చిట్స్ వేయొద్దు



చిట్‌ఫండ్స్ చట్టం మేరకు రిజిస్ట్రేషన్ చేసిన కంపెనీల్లోని చీటీలు వేయాలి. అనధికారికంగా నిర్వహించే వాటిలో చీటీ వేస్తే చివరకు మోసపోవడం తథ్యం. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడ్డీ కోసం ఆశపడితే అసలుకే ఎసరు వస్తుందని గ్రహించాలి.
– భర్కత్, న్యాయవాది, పలమనేరు



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

కుప్పంలో బాంబు కలకలం


పేలుడుకు చెల్లాచెదురైన వస్తువులు

కుప్పం : పట్టణంలోని కొత్తపేటలో ఆదివారం అర్ధరాత్రి బాంబు పేలుడు కలకలం సృష్టించింది. పెద్దపల్లె ఆలయ సమీపంలో బొరుగుల రాణెమ్మ ఇంటి ఆవరణలో బాంబు పేలడంతో అక్కడే నిద్రిస్తున్న మురుగేష్, ధనలక్ష్మి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. భారీ శబ్దానికి చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. రక్తపు మడుగులో పడిఉన్న బాధితులను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులు–2024కు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్ ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమ మొదలైన రంగాల్లో అత్యున్నతమైన ప్రతిభ కనబరిచిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో www.padmaawards. gov.in లో పేర్లను నమోదు చేసుకున్న తర్వాత www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0877–2286921 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం అంతర్ జిల్లాల సచివాలయ వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేశారు. బదిలీకి దరఖాస్తు చేసుకున్న 34 మంది కార్యదర్శులకు రికార్డులు పరిశీలించి కౌన్సెలింగ్ చేపట్టారు.

మాజీ కౌన్సిలర్ ఇంట్లో చోరీ

- రూ.30లక్షల సొత్తు అపహరణ

పలమనేరు : పట్టణంలోని మాజీ కౌన్సిలర్ అశోక్ ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బెంగళూరుకు వెళ్లిన బాధిత కుటుంబీకులు సోమవారం ఈ విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశబూరు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు స్థానిక కప్పలవీరాస్వామి వీధిలో అశోక్ కాపురంముంటున్నారు. మూడు రోజుల క్రితం సొంత పనిపై బెంగళూరుకు వెళ్లగా దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి రూ.7లక్షల నగదు, రూ.23 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. క్లూస్‌టీం, క్రైమ్‌పార్టీ పోలీసులు చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు, వేలిముద్రలను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు.


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

చోరీ కేసులో నిందితుల విచారణ

చిత్తూరు అర్బన్: నగరంలోని మైదా ఫ్యాక్టరీ రోడ్డులోని ఓ ఇంట్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో చోరీకి పాల్పడిన కేసుకు సంబంధించి తమిళనాడు నిందితులను పోలీసులు సోమవారం విచారించారు. అపహరించిన బంగారు, వెండి ఆభరణాలను తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన వైరముత్తు అనే వ్యక్తి ఇచ్చినట్లు నిందితులు అయ్యప్పన్, పూమతి వెల్లడించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

సరికొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్.. హైమాస్ట్ లైట్లు!


ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ, కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, హైమాస్ట్ విద్యుత్ లైట్లు, డివైడర్లను స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, కమిషనర్ అరుణ సోమవారం ప్రారంభించారు. నగర నడిబొడ్డున హ్లాదకర వాతావరణం సృష్టించినందుకు సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. గాంధీ సర్కిల్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు రూ.28.20లక్షలతో నిర్మించిన డివైడర్లు, రూ. 14.90లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, రూ.20 లక్షలతో గాంధీ సర్కిల్లో ట్రాఫిక్ లైట్లు, రూ.16లక్షలతో ఎమ్మెస్సార్ సర్కిల్ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ లైట్లను ప్రారంభించామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరులో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఎస్పీ రిషాంత్ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు డివైడర్లు, లైట్ల ఏర్పాటుతో పరిష్కారం దొరికిందన్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ ఐకానిక్ ఐలాండ్‌గా గాంధీ విగ్రహ కూడలిని అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ బాబు, మున్సిపల్ ఇంజినీర్ వెంకటప్రసాద్, ఏఈలు శ్రీలత, రవీంద్రనాయక్, లోకేష్, కార్పొరేటర్ ఉన్నికృష్ణన్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్:నగరంలోని ఓటి చెరువుకు చెందిన కల్యాణ్(39) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. కల్యాణ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. కల్యాణ్ బెంగళూరులో జేసీబీలు నిర్వహిస్తున్నాడు. లక్ష్మి చిత్తూరులో సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తోంది. ఆదివారం రాత్రి దంపతుల మధ్య చిన్నపాటి గొడవ రావడంతో లక్ష్మి కొన్ని మాత్రలు మింగేసింది. సకాలంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో కోలుకుంది. ఈ క్రమంలో మనస్తాపం చెందని కల్యాణ్ ఇంట్లో ఉరివేసుకుని మరణించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు–నేడు పనులకు అధిక ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో చేపట్టిన నాడు–నేడు పనులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నాడు–నేడు, జగనన్న విద్యాకానుక పంపిణీ పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి నాడు–నేడు పనులు పూర్తికావాలని ఆదేశించినా ఎందుకు ఆలస్యమైందని మండిపడ్డారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల నిర్వహణకు ఇచ్చిన బడ్జెట్‌ను సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వి.కోట మండలం జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ), చింతమాకులపల్లె, జౌనిపల్లె, లింగాపురం, కొంగాటం ప్రధానోపాధ్యాయుల ఈ నెల వేతనాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. నాడు–నేడు పనులు పూర్తయిన పాఠశాలల ఫొటోలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యాకానుక కిట్‌ల పంపిణీకి సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ ఆథెంటిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డీఈఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ ఏకాంబరం

చిత్తూరు రూరల్: అర్చకుల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఏకాంబరం హామీ ఇచ్చారు. సోమవారం చిత్తూరులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన అర్చకుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐడీ, హెల్త్ కార్డులు ఇవ్వాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, జీతాలను సక్రమంగా అందించాలని పలువురు అర్చకులు విన్నవించారు. ధూపదీప నైవేద్యాలపై తలెత్తిన సమస్యలను వివరించారు. దీనిపై సహాయ కమిషనర్ స్పందించారు. అర్చకులు తమ సమస్యలను స్పందనలో అర్జీల రూపంలో కూడా అందించవచ్చన్నారు. జీతభత్యాల చెల్లింపులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధాన డిమాండ్లను దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అర్చకులు వేణుగోపాల్, సుధాకర్ గురుక్కల్ పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు ‘నేస్తం’

- కలెక్టరేట్‌లో వైఎస్సార్ లా నేస్తం జిల్లా స్థాయి కార్యక్రమం
- 97 మంది లబ్ధిదారులకు ఆర్థికసాయం


మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : యువ న్యాయవాదులకు అండగా నిలిచేందుకే ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం కింద ఆర్థిక సాయం అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు మేయర్ అముద తెలిపారు. సోమవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో 2023–24 సంవత్సరానికి తొలి విడత వైఎస్సార్ లా నేస్తం పథకం కింద నగదును బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ లా నేస్తం వంటి పథకం దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని వెల్లడించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కొత్తగా లా పట్టా తీసుకున్నవారు వృత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్లపాటు ఏడాదికి రూ.60 వేలను రెండు విడతలుగా అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విదేశీ వ్యవహారాల సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు రుణాలు, గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీలు తదితర అవసరాలకు సీఎం జగన్ ఇప్పటికే రూ.కోట్లు అందించారని తెలిపారు. లా నేస్తం అమలులో ఇబ్బందుల పరిష్కారానికి ప్రత్యేకంగా 1902 నంబర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జెడ్పీటీసీ సభ్యులు భారతి, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

ప్రోత్సాహకరం



నేను చిత్తూరు ఆర్వీఎస్ నగర్‌లోని ఆర్‌కేఎం లా కళాశాలలో చదివా. నా తండ్రి తాపీమేస్త్రీగా పని చేస్తారు. రెండేళ్లుగా జూనియర్ అడ్వొకేట్‌గా కొనసాగుతున్నాను. 2019లో విద్యాదీవెన, వసతి దీవెన పథకాల లబ్ధి పొందా. ప్రస్తుతం లా నేస్తం లబ్ధి పొందుతున్నా. ఈ పథకం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది.
– చందన్ కుమార్, జూనియర్ అడ్వొకేట్, చిత్తూరు

ఉపయోగకరం



నేను 2023 ఫిబ్రవరిలో లా నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరం. జూనియర్ అడ్వొకేట్ సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు. నాలాంటి ఎందరో జూనియర్ న్యాయవాదులకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోంది.
– చరీష్‌కుమార్, జూనియర్ అడ్వొకేట్, చిత్తూరు

చిత్తూరు పోలీస్ బెటాలియన్ కు 980 పోస్టుల మంజూరు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఐఆర్ పోలీస్ బెటాలియన్‌కు 980 పోస్టులను మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమాండెంట్ అదనపు కమాండెంట్‌తో పాటు 917 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, మినిస్టీయల్ స్టాఫ్ 22, మెడికల్ స్టాఫ్ 18, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ స్టాఫ్ కింద 33 పోస్టులను మొత్తం కలిపి 980 పోస్టులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

గుడుపల్లె ఎంపీడీఓపై వేటు

చిత్తూరు కలెక్టరేట్ : గుడుపల్లె ఎంపీడీఓ రమణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షణ్మోహన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. విధి నిర్వహణలో అలసత్వం, ఉన్నతాధికారుల సూచనలు పాటించకపోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పురోగతిలో విఫలం కావడంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పలమనేరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిని విచారణ చేపట్టి 15 రోజుల్లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గుడుపల్లె ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ శంకర్‌ను నియమిస్తున్నట్లు వెల్లడించారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్

యాదమరి : మండలంలోని కమ్మరాయనిమిట్ట గ్రామం వద్ద నీవానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఓ టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.